సాక్షి మంచిర్యాల

శనివారం : 22 : ఏప్రిల్ : 2023



అకాల వర్షం.. అతలాకుతలం

అకాలవర్షంతో జన్నారం, భీమిని మండలాల్లో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. మామిడికాయలు రాలిపోయాయి. వందలాది ఎకరాల్లో వరి పంట నేలవాలింది. వరిధాన్యం తడిసింది. IIలో▸



చెవిలో పువ్వులతో నిరసన

జిల్లాలో ఐకేపీ వీవోఏలు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన కొనసాగిస్తున్నారు. శుక్రవారం చెవిలో పువ్వులతో వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. IIIలో▸

గరిష్ఠం/కనిష్ఠం

38.0 /26.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. గరిష్ఠ ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగే అవకాశం ఉంది. ఆగ్నేయం దిశగా వడగాలులు వీస్తాయి.

బియ్యం పాస్‌లో ఇద్దరు !



సీఎంఆర్‌కు కింద మిల్లర్లు గోదాంకు పంపిన బియ్యం (ఫైల్)

- పేరుకు గుమస్తాలే కానీ వారే కీలకం
- అధికారులు, మిల్లర్లకు మధ్యవర్తిత్వం
- నాణ్యత లేనివి పాస్ చేసి టర్మినేట్ అయిన అధికారి
- సీఎంఆర్‌లో ప్రతీ సీజన్‌లో భారీగా గోల్‌మాల్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జిల్లాలో సీఎంఆర్(కస్టం మిల్లింగ్ రైస్)లో ఏటా సీజన్‌లో రూ.కోట్ల దందా సాగుతోంది. గత కొన్నేళ్లుగా సీఎంఆర్ టెక్నికల్‌గా 'పాస్' చేయించడంలో ఇద్దరు వ్యక్తులు కీలకంగా మారారు. రైస్‌మిల్లర్లు, పౌరసరఫరాలశాఖ అధికారులకు మధ్యవర్తిత్వం నెరుపుతూ భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. మీకింతా, మాకింత అన్నట్లుగా వ్యవహారం సాగుతోంది. మిల్లర్లు ఇచ్చే బియ్యాన్ని గోదాంలోకి దించుకోవాలంటే పరిశీలన చేయాలి. రేషన్‌బియ్యం, నాణ్యత లేవిని కూడా పాస్ చేయాలంటే బండికో రేటుతో ఓకే చెబుతున్నారు. బియ్యం నాణ్యతను బట్టి రూ.పది వేల నుంచి రూ.30వేలు వరకు తీసుకుంటున్నారు. ఇక నాణ్యత ఉన్న లారీ వస్తే కనీసం రూ.3,850 చొప్పున వసూలు చేస్తున్నారు. వీటిలో అసోసియేషన్, గుమస్తాల కమీషన్, అధికారులు, అందరికీ చేరుతున్నట్లు తెలుస్తోంది. గత కొంతకాలంగా ఓ టెక్నికల్ ఆఫీసర్ నాణ్యత లేకున్నా బియ్యాన్ని పాస్ చేశారు. రాష్ట్ర ఉన్నతాధికారుల తనిఖీల్లో ఆ బియ్యం సరిగా లేవని గుర్తించారు. ఆ బియ్యాన్ని తిరిగి మిల్లులకు పంపించాలని ఆదేశాలు ఇచ్చారు. అయినప్పటికీ గోదాంలోనే నెలల తరబడి లిఫ్టింగ్ చేయకుండా ఉంచారు. పలుమార్లు ఆ మిల్లర్లకు నోటీసులు పంపించారు. మార్పు లేకపోవడంతో ఆ రిటైర్డ్ అధికారిపై వేటు పడింది.

రూ.కోట్లకు పడగలెత్తిన గుమస్తాలు

ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లర్లకు ఇస్తే, మరాడించి బియ్యంగా ఇవ్వాలి. ఇందుకు ప్రభుత్వం కమీషన్ ఇస్తుంది. సర్కారు ఇచ్చే కమీషన్‌పైనే కాకుండా కొందరు ధాన్యం గోల్‌మాల్ చేస్తూ రూ.కోట్లకు పడగలెత్తారు. నిర్ణీత గడువులోపు ఇవ్వాల్సి ఉన్నా జాప్యం చేస్తూ ధాన్యం పక్కదారి పట్టిస్తూ దండుకుంటున్నారు. అయినా కొందరు అధికారులు ఇదంతా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. సీఎంఆర్‌ను ఎఫ్‌సీఐ, సివిల్ సప్లయి కార్పొరేషన్ రెండింటికి అందించాలి. చాలావరకు ఎఫ్‌సీఐకి ఇవ్వకుండా కేవలం కార్పొరేషన్‌కే పంపిస్తున్నారు. తాజాగా ఎఫ్‌సీఐకి పంపనివి 19మిల్లులు బ్లాక్ లిస్టులో చేరాయి. ఇక ప్రతీ మిల్లు కార్పొరేషన్‌కే పంపించేలా చూడడం, ఇద్దరు గుమస్తాలతో పని చేయించుకోవడం పరిపాటిగా మారింది. ఈ మధ్యవర్తిత్వంతోనే ఆ గుమస్తాలు రూ.కోట్లకు పడగలెత్తారు.

టర్మినేట్ అయిన అధికారి

జిల్లాలో పౌరసరఫరాల శాఖ, ఎఫ్‌సీఐలో క్వాలిటీ ఇన్‌స్పెక్టర్లు సాంకేతికంగా పరిశీలనలు చేసి బియ్యాన్ని పాస్ చేయాలి. అంటే మిల్లర్లు పంపిస్తున్న బియ్యంలో నూక శాతం, రంగు, గింజ తదితరవన్నీ సాంకేతికంగా పరిశీలించి అప్రూవల్ చేయాలి. వీరు ఓకే చేస్తేనే బియ్యం గోదాంలోకి వెళ్తాయి. తిరస్కరిస్తే తిరిగి మిల్లులకు చేరుతాయి. బియ్యం పాస్ చేయించడంలో ముడుపులకు ఆశపడి కొందరు ఓకే చెబుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. చినిగిన గన్నీ సంచుల్లో వచ్చినా దించుకోవద్దు. ఇక రేషన్ బియ్యం రీ సైక్లింగ్ అవుతుందనే అనుమానంతో రసాయన పరీక్షలు జరపాలి. కానీ ఇవన్నీ చేయకుండానే పాస్ చేస్తున్నారు. ఇటీవల జిల్లాలో ఓ టెక్నికల్ ఇన్‌స్పెక్టర్‌ను తన విధుల్లో నుంచి టర్మినేట్ చేశారు. గత సీజన్‌లోని 21 ఏసీకే(ఒక ఏసీకే 290క్వింటాళ్లు)బియ్యం నాణ్యత లేవని రాష్ట్ర విజిలెన్స్ అధికారుల తనిఖీల్లో బయటపడింది. వాటిని తిరిగి ఆ మిల్లులకు పంపాలని ఉత్తర్వులు ఇస్తూ, ఆ క్వాలిటీ ఇన్‌స్పెక్టర్‌ను విధుల్లో నుంచి తొలగించారు. బయటకు మాత్రం ఆయనే విధుల్లో నుంచి తప్పుకున్నట్లు చెబుతున్నారు.

కారు ఆఫర్ చేసిన మిల్లర్ ?

జిల్లాలో ఓ అధికారికి తమ వ్యవహారాలన్నీ కాపాడేందుకు ఓ మిల్లర్ కారు ఇస్తానని ఆఫర్ చేసినట్లు విశ్వసనీయ సమాచారం. అంతేకాక ఇటీవల ఆ అధికారి నగదు కాకుండా బంగారం రూపంలో ఇవ్వాలని మెలికిపెడితే ఇప్పటికే కొందరు ఇచ్చినట్లు తెలుస్తోంది. ప్రతీ నెలా రూ.2నుంచి 3లక్షల వరకు ఆదాయం ఉన్న ఆయన వానాకాలంలో జిల్లాలో ఒక మిల్లులోనే ధాన్యం తడిసినట్లు పంచనామా రిపోర్టు ఇచ్చి మిగతా వాటిని పట్టించుకోలేదని మిల్లర్లే చెబుతున్నారు. అందుకు భారీగా ముట్టినట్లు తెలుస్తోంది.

న్యూస్‌రీల్

ఈద్ ముబారక్

- నేడు రంజాన్ పండుగ
- ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

నెన్నెల: రంజాన్ మాస ఉపవాస దీక్షలు ముగిసాయి. శుక్రవారం నాటికి 30రోజులు పూర్తి కావడం, రాత్రి ఆకాశంలో నెలవంక దర్శనమివ్వడంతో శనివారం రంజాన్ పండుగ నిర్వహణకు ముస్లింలు సిద్ధమయ్యారు. నెలరోజులపాటు రంజాన్ దీక్షలు పాటించిన ముస్లింలు రంజాన్ మాసం అనంతరం షవ్వాల్ మాసం మొదటి రోజు నిర్వహించుకునే పండుగ ఈద్–ఉల్–ఫితర్. ఉదయాన్నే ముస్లింలు తలంటు స్నానాలు చేసి కొత్త బట్టలు ధరించి ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. అక్కడ మతగురువుల చేసే బోధనలు ఆచరిస్తారు. సామూహిక ప్రార్థనల అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ అంటూ శుభాకాంక్షలు తెలియజేసుకుంటారు. బంధువులు, స్నేహితులను ఇంటికి పిలిచి షీర్ ఖుర్మా(సేమియా)తో విందు ఏర్పాటు చేస్తారు. కాగా, జిల్లా వ్యాప్తంగా ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలకు అన్ని ఏర్పాట్లు చేశారు.

వేడుకలకు సర్వం సిద్ధం

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల పట్టణంలో రంజాన్ ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు చేశారు. స్థానిక అండాళమ్మకాలనీ, బస్టాండ్ ముందర ఉన్న ఈద్గాల వద్ద చదును, పరిశుభ్రత కార్యక్రమం పూర్తి చేశారు. వేసవి నేపథ్యంలో టెంట్లు ఏర్పాటు చేశారు. నీటి సౌకర్యం కల్పించారు. తాగునీటి వసతిపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈద్గాలను మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు, మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, వైస్ చైర్మన్ ముఖేష్‌గౌడ్, కమిషనర్ మారుతిప్రసాద్, కౌన్సిలర్లు, ముస్లిం పెద్దలు పరిశీలించారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

జిల్లా జడ్జి మైత్రేయికి సన్మానం



న్యాయమూర్తి మైత్రేయిని సన్మానిస్తున్న పీపీలు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలో మొదటి అదనపు జిల్లా, పోక్సో కోర్టు న్యాయమూర్తిగా పని చేసి బదిలీపై వెళ్తున్న జే.మైత్రేయిని పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, కోర్టు లైసన్ అధికారులు శుక్రవారం కోర్టు ఆవరణలో ఘనంగా సన్మానించారు. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన బదిలీల్లో జిల్లా జడ్జి మైత్రేయిని హైదరాబాద్ సీబీఐ కోర్టుకు బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పులి రాజమల్లు, పోక్సో కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సురేంద్రోపాధ్యాయ, సబ్ కోర్టు పీపీ మదన్ మోహన్, కోర్టు లైసన్ ఆఫీసర్లు ఎస్సై కే.శ్రీనివాస్, గులాందస్తగిర్, ఫరిస్‌రాజు పాల్గొన్నారు.

వ్యాక్సిన్‌పై స్పందన నామమాత్రం

మంచిర్యాలటౌన్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో 18 ఏళ్ల పైబడి, రెండు డోసుల వ్యాక్సిన్లు వేసుకున్న వారికి, 12–14 ఏళ్లలోపు మొదటి డోసు వేసుకున్న వారికి వేస్తున్న ప్రికాషనరీ డోసు కరోనా వ్యాక్సిన్‌కు స్పందన అంతంత మాత్రంగానే వస్తోంది. శుక్రవారం జిల్లాలో 18 ఏళ్లు పైబడిన వారిలో 20 మందికి, 12–14 ఏళ్లు పైబడిన వారిలో 20 మందికి మాత్రమే కార్బేవ్యాక్స్ ప్రికాషనరీ డోస్ వ్యాక్సిన్‌ను ఇచ్చినట్లు వైద్యులు తెలిపారు.

కుష్ఠువ్యాధికి చికిత్స తీసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సుబ్బరాయుడు

మంచిర్యాలటౌన్: కుష్ఠువ్యాధి లక్షణాలు ఉన్న వారు ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స తీసుకుంటే వైకల్యం రాకుండా కాపాడుకోవచ్చని జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుబ్బరాయుడు అన్నారు. జిల్లా కేంద్రంలోని పాతమంచిర్యాల అర్బన్ హెల్త్ సెంటర్‌లో శుక్రవారం స్టేట్ శాంపిల్ సర్వే కమ్ అసిస్టెంట్ యూనిట్ నల్లకుంట, హైదరాబాద్ నుంచి వచ్చిన వైద్య బృందం కుష్ఠువ్యాధి రికార్డులు, రిపోర్టులను పరిశీలించి, వ్యాధి నిర్మూలనకు తీసుకుంటున్న చర్యలు పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ అన్ని ఆరోగ్య కేంద్రాల్లో మందులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బృందం సభ్యులు నరసింహారెడ్డి, అరుణ, రాఘవయ్య, జి.మొగిలి, శివకుమార్, డాక్టర్ రమేశ్, డెమో బుక్క వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బంగారు చెన్నూర్‌గా తీర్చిదిద్దుతా

- ఇంటర్ స్టేట్ జంక్షన్‌గా చెన్నూర్
- ప్రభుత్వ విప్ బాల్క సుమన్



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బాల్క సుమన్

చెన్నూర్: చెన్నూర్ పట్టణాన్ని బంగారు చెన్నూర్‌గా తీర్చిదిద్దుతానని, కేసీఆర్ ఆశీర్వాదంతో ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దులో గల గోదావరి ఒడ్డున ఉన్న చెన్నూర్‌ను ఇంటర్ స్టేట్ జంక్షన్‌గా చేస్తామని ప్రభుత్వ విప్ బాల్క సుమన్ అన్నారు. స్థానిక ఏంఆర్‌ఆర్ గార్డెన్‌లో శుక్రవారం చెన్నూర్ మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం పార్టీ జిల్లా ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా విప్ సుమన్ మాట్లాడుతూ గత నాలుగేళ్లలో చెన్నూర్‌కు రూ.200 కోట్ల నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ఎన్నికల కోసం వచ్చే కాంగ్రెస్, బీజేపీలు చెన్నూర్‌కు ఏం చేశాయో చెప్పాలని కార్యకర్తలు ప్రశ్నించాలని తెలిపారు. గతంలో లీటర్ పెట్రోల్ ధర రూ.56 ఉంటే కేంద్ర ప్రభుత్వం రూ.120కి పెంచిందన్నారు. మేడిగడ్డ నిర్మాణంతో ఈ ప్రాంత పంటలు నీటిమునిగాయని ప్రచారం చేస్తున్నారని తెలిపారు. 1983–84, 1995–96, 2003–04 సంవత్సరాల్లో మేడిగడ్డ నిర్మించారా, ఆనాడు భారీ వర్షాలకు వరదలు వచ్చి పంటలకు నష్టం వాటిల్లలేదా అని ప్రశ్నించారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా వర్షాలు పెద్ద ఎత్తున కురిసి వరదలు వస్తాయని అన్నారు. కేసీఆర్ ప్రాజెక్ట్ నిర్మించడంతోనే వరదలు వచ్చాయని బీజేపీ, కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేణికుంట్ల ప్రవీణ్, మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చనరాంలాల్‌గిల్డా కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మరణంలోనూ వీడని బంధం

- విద్యుదాఘాతంతో భార్యాభర్తలు దుర్మరణం
- భార్యను కాపాడే ప్రయత్నంలో భర్తకు షాక్



మృతదేహాల వద్ద విలపిస్తున్న పవన్‌తేజ



శశిదేవి, శ్రీనివాస్ మృతదేహాలు

చెన్నూర్: ఏడడుగుల బంధంతో ఒక్కటైన ఆ జంట కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ ఒక్కటిగా జీవిస్తోంది. ఒకరికొకరై ఇద్దరు పిల్లలతో అన్యోన్యతకు ఆదర్శంగా నిలుస్తోంది. ఆ అనుబంధాన్ని చూసి విధికి కన్నుకుట్టిందేమో..! విద్యుదాఘాతం రూపంలో బలి తీసుకుంది. కరెంటు షాక్ తగిలిన భార్యను కాపాడే ప్రయత్నంలో భర్త ఆమెతోపాటే మృత్యు ఒడికి చేరాడు. ఈ సంఘటన మంచిర్యాల జిల్లా చెన్నూర్ పట్టణంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. చెన్నూర్ పట్టణంలోని లైన్‌గడ్డలో స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడు బొల్లంపల్లి శ్రీనివాస్(45), శశిదేవి దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు చరణ్‌రాజ్, పవన్‌తేజ ఉన్నారు. శ్రీనివాస్‌కు పట్టణంలో బంగారం దుకాణం ఉంది. ఇంటివద్ద వాటర్‌ప్లాంటు కూడా నిర్వహిస్తుంటాడు. శశిదేవి అటు దుకాణంలో, ఇంట్లో వాటర్‌ప్లాంటు వద్ద చేదోడుగా ఉంటూ సహకరిస్తుండేది. శుక్రవారం వేకువజామున శశిదేవి వాకిలి శుభ్రం చేసి ఇంట్లోకి వెళ్తూ జీఏ వైర్‌తో ఏర్పాటు చేసిన ఇనుప తీగపై ఉన్న బనియన్ తీస్తుండగా ఒక్కసారిగా విద్యుత్ షాక్ తగిలి కేకలు వేస్తూ కింద పడిపోయింది. ఆమె కేకలు విన్న శ్రీనివాస్ ఏమైందోనని పరుగు వచ్చి ఆమెను పైకి లేపే ప్రయత్నంలో అతడికీ షాక్ తగిలింది. దీంతో ఇద్దరూ అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు.

మీ ఇద్దరికి ఏమైంది మమ్మీ..

''మీ ఇద్దరికి ఏమైంది మమ్మీడాడీ.. మమ్మల్ని వదిలి ఎక్కడికి వెళ్లారు. మమ్మల్ని ఎవరు చూసుకుంటారు..'' అంటూ చిన్న కుమారుడు పవన్‌తేజ తల్లిదండ్రుల మృతదేహాల వద్ద విలపించడం అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది. చరణ్‌రాజ్ డిగ్రీ చదువుతుండగా, పవన్‌తేజ పదో తరగతి చదువుతున్నాడు. కళ్లముందే కొడుకు, కోడలు చనిపోవడంతో శ్రీనివాస్ తండ్రి లక్ష్మీనారాయణ కన్నీరుమున్నీరుగా విలపించాడు. లక్ష్మీనారాయణ భార్య అనారోగ్యంతో మృతిచెందగా, పెద్దకుమారుడు రెండేళ్ల క్రితం గుండెపోటుతో చనిపోయాడు. కొడుకు, కోడలు మృత్యువాత పడడంతో వృద్ధాప్యంలో చూసుకునే వారు లేరంటూ విలపించాడు.

విప్ సుమన్ పరామర్శ

మృతుల కుటుంబ సభ్యులను ప్రభుత్వ విప్ బాల్క సుమన్ పరామర్శించారు. దంపతుల మృతి బాధాకరమని అన్నారు. కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహాలను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ వాసుదేవరావు తెలిపారు. కాగా, శ్రీనివాస్ దంపతుల మృతికి సంతాపంగా స్వర్ణకారులు దుకాణాల బంద్ పాటించారు.

పంట నష్ట పరిహారం విడుదల

- నష్టపోయిన రైతులకు రూ.30.70లక్షలు
- 307 ఎకరాలు.. 312 మంది రైతులు



గత నెలలో దెబ్బతిన్న మొక్కజొన్న పంట

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో గత నెలలో కురిసిన అకాల వర్షాలకు యాసంగి పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం మంజూరు చేసింది. 307 ఎకరాల్లో 312 మంది నష్టపోయినట్లుగా గుర్తించి ఎకరానికి రూ.10వేల చొప్పున రూ.30.70లక్షల విడుదల చేసింది. మార్చి 16 నుంచి 20వరకు కురిసిన అకాల వర్షాలకు మొక్కజొన్న, మామిడి, వరి తదితర పంటలకు నష్టం వాటిల్లిన విషయం తెలిసిందే. అకాల వర్షాలు, వడగళ్ల వాన వల్ల నష్టపోయిన రైతులకు పరిహారం అందజేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించడంతో నిబంధనల ప్రకారం గ్రామాల వారీగా అధికారులు సర్వే చేశారు. జిల్లా వ్యవసాయ అధికారుల అంచనా ప్రకారం ఎకరాకు వన్‌టైం సెటిల్‌మెంటు ప్రకారం ప్రభుత్వం బడ్జెట్ విడుదల చేయడంతో రైతులకు అందజేయనున్నారు. నిబంధనల ప్రకారం 33శాతం కన్న ఎక్కువగా నష్టపోయిన పంటలను గుర్తించారు. దండేపల్లి మండలంలో ఎనిమిది గ్రామాలు, హాజీపూర్ మండలం నమ్నూర్, మందమర్రి మండలం సారంగపల్లి, జన్నారం మండలం రాంపూర్, తిమ్మాపూర్, సింగరాయిపేట, రోటిగూడ గ్రామాల్లో వరి, మొక్కజొన్న, మిర్చి పంటలు, మామిడితోటలకు నష్టం వాటిల్లినట్లు గుర్తించారు. మొత్తం 13గ్రామాల్లో 312మంది రైతులకు చెందిన 307 ఎకరాల్లో నష్టం జరిగినట్లు ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. మంజూరైన నష్టపరిహారం రైతుల ఖాతాల్లో జమ కానుంది.

పంట	నష్టం	రైతులు	పరిహారం(రూ.లలో)
వరి	62	68	6,20,000
మొక్కజొన్న	147	182	14,70,000
మామిడి	64	41	6,40,000
మిర్చి	31	19	3,10,000
పెసలు	03	2	30,000



కుటుంబ పాలనను తరిమికొట్టాలి

- కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాల
- జిల్లాలో బూత్‌కమిటీల సమావేశం



మంచిర్యాలలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాల, వేదికపై రఘునాథ్

మంచిర్యాలటౌన్: ఎన్నో ఆశలతో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకుంటే, సీఎం కేసీఆర్ ప్రజల కోసం కాకుండా తన కుటుంబం కోసం పాలన చేస్తున్నారని, ఈ కుటుంబ పాలనను తరిమికొట్టాలని మత్స్య, పశుసంవర్ధక, పాడిపరిశ్రమ శాఖ కేంద్రమంత్రి పురుషోత్తం రూపాల అన్నారు. పార్లమెంట్ ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మంచిర్యాలలో బీజేపీ బూత్ కమిటీల సమావేశం, మంచిర్యాల అసెంబ్లీ శక్తి కేంద్ర ఇంచార్జీల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అధికారంలోకి రావాలంటే కేవలం బూత్ స్థాయి కార్యకర్తలతోనే సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి, జిల్లా ఇంచార్జి పల్లె గంగారెడ్డి, గోనె శ్యాంసుందర్‌రావు, ఆరుముళ్ల పోషం, విష్ణువర్ధన్, మల్లిఖార్జున్, నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, రజనీశ్ జైన్, అందుగుల శ్రీనివాస్ పాల్గొన్నారు. కాగా, మంచిర్యాల గంగపుత్ర సంఘం సభ్యులు తమ సమస్యలు పరిష్కరించాలని కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేశారు.

కలిసికట్టుగా పని చేయాలి

బెల్లంపల్లి: రాష్ట్రంలో క్షేత్రస్థాయి నుంచి బీజేపీ బలోపేతానికి శ్రేణులంతా కలిసికట్టుగా పని చేయాలని కేంద్రమంత్రి పురుషోత్తం రూపాల అన్నారు. శుక్రవారం బెల్లంపల్లిలోని బాలాజీమినీ ఫంక్షన్ హాల్‌లో అసెంబ్లీ నియోజకవర్గ శక్తి కేంద్రాల ఇంచార్జీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని తెలిపారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మునిమంద రమేష్, పార్టీ పట్టణ అధ్యక్షుడు రమేష్, పెద్దపల్లి పార్లమెంట్ కన్వీనర్ మల్లికార్జున్, కో కన్వీనర్ వెంకటేశ్వర్‌గౌడ్, సీనియర్ నాయకులు కొయ్యల ఏమాజీ, పుల్గం తిరుపతి, కె.గోవర్ధన్, రాజలింగు, రాజులాల్, రజిని, కేశవరెడ్డి, మల్లేష్ పాల్గొన్నారు.

సైనికుల్లా పనిచేయాలి

రామకృష్ణాపూర్: రాబోయే ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపు కోసం ప్రతీ కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని కేంద్రమంత్రి పురుషోత్తం రూపాల అన్నారు. క్యాతనపల్లి మున్సిపాలిటీలోని గద్దెరాగిడి ఎంఆర్ గార్డెన్స్‌లో శుక్రవారం పార్టీ శక్తి కేంద్రాల ఇన్‌చార్జీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ హయాంలో దేశంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. అనంతరం రామకృష్ణాపూర్‌కు చెందిన పార్టీ కార్యకర్త, దళితుడు ప్రసాద్ ఇంట్లో మంత్రి భోజనం చేశారు. మహంకాళి శ్రీనివాస్, అక్కల రమేష్, అందుగుల శ్రీనివాస్, వేముల అశోక్, లచ్చన్న పాల్గొన్నారు.

బీఎంఎస్ నేతల భేటీ

శ్రీరాంపూర్: కేంద్రమంత్రి పురుషోత్తం రూపాలతో బీఎంఎస్ నేతలు భేటీ అయ్యారు. సీసీసీలోని సింగరేణి గెస్టుహౌజ్‌లో బీఎంఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పేరం రమేశ్ తదితరులు కలిశారు. సింగరేణి బొగ్గు బ్లాకుల ప్రైవేటు పరంపై రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి, పార్లమెంట్లలో వారు బొగ్గు గనుల చట్టంపై ఓటు వేసిన అంశంపై చర్చించారు. యూనియన్ నాయకులు కాసెట్టి నాగేశ్వర్‌రావు, మొగిలి, పూనం రామకృష్ణ, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలి

- గొర్రెల పంపిణీ పకడ్బందీగా చేపట్టాలి
- జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా పశు వైద్యాధికారి రమేష్, సంయుక్త సంచాలకులు శంకర్‌లతో కలిసి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గొల్లకుర్మల, యాదవ సొసైటీలు 183 ఉన్నాయని, గ్రామసభల ద్వారా అర్హులైన లబ్ధిదారులను లాటరీ పద్ధతిలో ఎంపిక చేశామని, ఇప్పటివరకు 4,138 మంది వివరాలను గ్రౌండింగ్ చేశామని తెలిపారు. ప్రకాశం, కర్నూల్, కర్ణాటక, బళ్లారి, సోలాపూర్, మహారాష్ట్రలో గొర్రెలు కొనుగోలు చేయాలని, వాహనానికి జీపీఆర్‌ఎస్ ట్రాకింగ్ చేస్తామని పేర్కొన్నారు. గొర్రెల పంపిణీ కార్యక్రమం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాల్లో ఏర్పాటు చేయాలని తెలిపారు. అనంతరం వెటర్నరీ సహాయకులతో సమీక్ష నిర్వహించి పలు సూచనలు, సలహాలు చేశారు.

'వ్యాపారులతో నాయకుల కుమ్మక్కు'



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ప్రేంసాగర్‌రావు

లక్సెట్టిపేట: బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు వ్యాపారులతో కుమ్మక్కై రైతులకు అన్యాయం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేంసాగర్‌రావు విమర్శించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఐబీ ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కోత విధిస్తూ రైతులకు నష్టం చేస్తున్నారని, గూడెం లిఫ్ట్ లీకేజీ ద్వారా నష్టపోయిన రైతులకు పరిహారం అందించడంలో విఫలమయ్యారని ఆరోపించారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లు, మూడెకరాల భూమి వంటి హామీలు నెరవేర్చలేదని తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ చెల్ల నాగభూషణం, చింత అశోక్, వైస్ ఎంపీపీ పెయ్యాల దేవేందర్‌రెడ్డి. మండలాధ్యక్షుడు పింగళి రమేష్, పట్టణాధ్యక్షుడు ఎండీ ఆరిఫ్, మండల నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎఫ్‌సీఐ బోర్డు సభ్యుడిగా తిరుపతి


తిరుపతి

తాండూర్: మండలానికి చెందిన పుల్లం తిరుపతి ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ) తెలంగాణ రాష్ట్ర సభ్యుడిగా నియామకమయ్యారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా తిరుపతి క్రియాశీలకంగా పని చేస్తున్నారు. పార్టీకి చేస్తున్న సేవలకు గుర్తింపుగా బీజేపీ ప్రభుత్వం ఎఫ్‌సీఐ రాష్ట్ర సభ్యుడిగా అవకాశాన్ని కల్పించింది.

అంతర్జాతీయ వుషూ టోర్నీకి నస్పూర్ వాసి


శివమహేశ్

నస్పూర్: రష్యాలోని మాస్కోలో మే 2 నుంచి 8వ తేదీ వరకు జరిగే అంతర్జాతీయ వుషూ పోటీలకు నస్పూర్‌కు చెందిన మాటూరి శివ మహేశ్ ఎంపికై నట్లు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వుషూ అసోసియేషన్ అధ్యక్షుడు వేముల సతీష్, కార్యదర్శి రాజనర్సు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వుషూ ఫుల్ కాంటాక్ట్ ఫైట్ 52 కేజీల విభాగంలో శివ మహేశ్ ఎంపికైనట్లు పేర్కొన్నారు.

మాలమహానాడు జిల్లా కమిటీ ఎన్నిక


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: జిల్లా మాలమహానాడు కార్యవర్గ ఎన్నికలు జిల్లా కేంద్రంలో గురువారం రాత్రి మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్ సమక్షంలో నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా నరేష్, ఉపాధ్యక్షులుగా బోగ వెంకటగిరి, డాక్టర్ బెంజిమెన్, కార్యదర్శిగా నరేష్, ప్రచార కార్యదర్శిగా శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జనార్దన్ జిల్లా యువత అధ్యక్షులుగా అశోక్‌తేజలను ఎన్నుకున్నారు. మాలల మల్ల యుద్ధ భేరీ సభ కాకినాడలో నిర్వహిస్తున్నామన్నారు. జాతీయ కార్యదర్శి రమేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, రాష్ట్ర కో ఆర్డినేటర్ శ్రీరాములు, పాల్గొన్నారు.

అకాల వర్షం.. అతలాకుతలం

- వెంకటపూర్‌లో రేకుల షెడ్డు కూలి రెండు దూడలు మృతి
- వందల ఎకరాల్లో నేలరాలిన వరి
- మామిడి కాయలు రాలి రైతు కన్నీరు


జన్నారం: వెంకటపూర్‌లో నేలకొరిగిన వరి పంట వద్ద రైతులు

జన్నారం: జన్నారం మండలంలో గురువారం రాత్రి, శుక్రవారం కురిసిన వర్షాలు రైతులను అతలాకుతలం చేశాయి. అన్నదాతకు తీరని నష్టం మిగిల్చింది. జన్నారం మండలం వెంకటపూర్ గ్రామంలో గొల్లపెల్లి రాజన్న, రమేశ్‌లకు చెందిన 15 ఎకరాల్లో చేతికి వచ్చిన వరి పంట నేలకొరిగింది. మల్లయ్యకు చెందిన ఆవుల మందకు అమర్చిన రేకుల షెడ్డు గాలికి కూలిపోయింది. రేకులు ఎగిరిపోయాయి. దీంతో రేకుల షెడ్డులోని రెండు దూడలు మృతిచెందగా పలు ఆవులు గాయాలపాలయ్యాయి. అదే విధంగా పొనకల్, జన్నారం, కవ్వాల్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పోసిన వరి ధాన్యం వర్షాలకు తడిసిపోయింది. మామిడికాయలు రాలిపోయాయి. గ్రామాల్లో పర్యటించి పంట నష్టం అంచనా వేసి రైతులను ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని వీబీఏ జిల్లా అధ్యక్షుడు గవ్వల శ్రీకాంత్ కోరారు. వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లో పర్యటిస్తూ పంట నష్టంపై అంచనా వేస్తున్నారు.

ఈదురుగాలులకు మామిడి పంటకి నష్టం

భీమారం: మండలంలో శుక్రవారం తెల్లవారు జామున ఈదురుగాలులకు మామిడి కాయలు రాలిపోయాయి. ఆర్కేపల్లిలో నష్టం ఎక్కువగా ఉందని రైతులు సందెల తిరుపతి, మల్లయ్య తెలిపారు.


జన్నారం: మృతి చెందిన దూడలు


జన్నారం: తడిసిన వరి ధాన్యం



భీమారం: నేలరాలిన మామిడి కాయలు

అమరుల స్మారక చిహ్నానికి 33ఏళ్లు

బెల్లంపల్లి: బొగ్గు గనుల క్షేత్రమైన బెల్లంపల్లికి విప్లవ, కార్మిక ఉద్యమాల చరిత్రకు పెట్టింది పేరు. ఉవ్వెత్తున ఎగిసి పడ్డ విప్లవ పోరాటంలో ఎందరో సింగరేణి కార్మికుల బిడ్డలు ఆకర్శితులై త్యాగాల బాటపట్టారు. నమ్మిన సిద్ధాంతం కోసం తుది శ్వాస వీడే వరకూ పోరాడి అమరులయ్యారు. ఆ అమర వీరుల జ్ఞాపకార్థంగా బెల్లంపల్లి పాత బస్టాండ్ ఏరియా టేకుల బస్తీ ప్రాంతంలో ప్రధాన రహదారిని ఆనుకుని నిషిద్ధ సింగరేణి కార్మిక సమాఖ్య(సికాస), పీపుల్స్‌వార్ నేతృత్వంలో అమరుల స్మారక స్తూపాన్ని నిర్మించారు. 1990 ఏప్రిల్ 22వ తేదీన విప్లవ రచయిత వరవరరావు నేతృత్వంలో అమరుల తల్లిదండ్రులతో ఈ స్తూపాన్ని ఆవిష్కరింపజేశారు. ఆ స్తూపానికి నేటితో సరిగ్గా 33 ఏళ్లు నిండాయి.

విప్లవ బీజాలు నాటిన పెద్ది శంకర్, గజ్జెల గంగారాం..

సింగరేణి కార్మికుల బిడ్డలు పెద్ది శంకర్, గంగారాం విద్యార్థి దశలో రాడికల్స్ కార్యకలాపాలకు ఆకర్శితులయ్యారు. ఉన్నత చదువులు చదువుతూనే విప్లవాన్ని జీవితాశయంగా మార్చుకుని అజ్ఞాతంలోకి వెళ్లారు. సింగరేణి కార్మికులు, కర్షకులు, మహిళలు, రైతు కూలీలు, విద్యార్థి, యువజనుల సమస్యలపై, దోపిడీ, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా కార్మిక, ప్రజాఉద్యమాలను నిర్మించారు. అడవిబాట పట్టిన పెద్ది శంకర్ 1980 నవంబర్ 2న మహారాష్ట్రలోని సిరోంచలో జరిగిన పోలీసు ఎదురు కాల్పుల్లో మృతి చెందాడు. బెల్లంపల్లి విప్లవోద్యమ చరిత్రలో తొలి అమరుడుగా పెద్ది శంకర్ పేరు చరిత్ర పుటల్లో నిలిచింది. వరంగల్ – కరీంనగర్ జిల్లాల్లోని సరిహద్దు అటవీ ప్రాంతంలో హ్యాండ్ గ్రెనేడ్లను తయారు చేసి పరీక్షిస్తున్న క్రమంలో చేతిలో గ్రెనేడ్ పేలి 1981 సెప్టెంబర్ 8న గజ్జెల గంగారాం తుది శ్వాస విడిచాడు. ఆ ఇద్దరు అమరులు నాటిన విప్లవ బీజాలు క్రమంగా మొలకెత్తి బెల్లంపల్లిలో ఉవ్వెత్తున విప్లవ జ్వాలలు ఎగిసి పడేలా చేశాయి.


బెల్లంపల్లిలో అమరుల స్మారక స్తూపం

ఆ అమరుల పేరుతో స్మారక స్తూపం

విప్లవ పోరాటంలో అమరత్వం పొందిన వీరుల పేరుతో స్మారకస్థూపాన్ని ఆవిష్కరించారు. తొలి అమర వీరులు గజ్జెల గంగారం, పెద్ది శంకర్‌లతో పాటు, పులి మధునయ్య, ముద్దు నారాయణ, షంషీర్ ఖాన్, నంది రవీందర్‌రెడ్డి, రామగుండం ఓదెలు, కలువల సారయ్య, నాగనవేణి పాల్గుణ, మంతెన వెంకటేశ్వర్లు పేర్లను స్మారక స్తూపంపై లిఖించారు.


ఉన్నత లక్ష్యాలతో పని చేయాలి

- ఇన్‌చార్జి జీఎం త్యాగరాజు

శ్రీరాంపూర్: ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని వాటిని సాధించడం కోసం కష్టపడి పనిచేయాలని సింగరేణి శ్రీరాంపూర్ ఏరియా ఇన్‌చార్జి జీఎం త్యాగరాజు తెలిపారు. సీసీసీలోని సింగరేణి పాఠశాలలో పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం గ్రాడ్యుయేషన్ సెర్మనీ, కేరీర్ గైడెన్స్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి పాఠశాలలో నాణ్యమైన విద్యబోధన జరుగుతుందన్నారు. అనంతరం డైట్ కాలేజీ రిటైర్డ్ ప్రిన్సిపల్ చంద్రప్రకాశ్‌రెడ్డి, జవహర్‌బాబులు విద్యార్థుల కేరీర్‌పై అవగాహన కల్పించారు. టెన్త్ తరువాత ఎలాంటి చదువులు చదివితే భవిష్యత్తు ఉంటుందో వివరించారు. పూర్వ విద్యార్థులు రాజారెడ్డి, కే.వాణిశ్రీలు విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు రాపోలు విష్ణువర్ధన్‌రావు చేతుల మీదుగా విద్యార్థులకు రోబ్, క్యాప్‌లు అందజేసి గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లను అందించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రాజేశ్వర్‌రావు, హెడ్‌మాస్టర్ శ్రీనివాస్‌రావు, పూర్వ విద్యార్థుల సంఘం ప్రధాన కార్యదర్శి దొనికెన మస్మయ్య, కోశాధికారి డప్పు సమ్మయ్య, ఉపాధ్యక్షులు కే శ్యాంసుందర్‌రెడ్డి, సభ్యులు టీ శంకర్, జక్కుల మల్లేశ్, కే తిరుపతి, సురేందర్, నల్ల సంపత్, కుమారస్వామి, గోసిక మనోజ్, ఇరుకుల్ల ప్రవీణ్ పాల్గొన్నారు.


సర్టిఫికెట్లతో విద్యార్థులు

ఏకలవ్య మోడల్ స్కూల్‌ను ఏర్పాటు చేయాలి


కేంద్ర మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఆదర్శ్‌వర్ధన్ రాజు

బెల్లంపల్లి: అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రం బెల్లంపల్లిలో ఏకలవ్య మోడల్ స్కూల్‌ను ప్రారంభించాలని ఎస్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఆదర్శ్‌వర్ధన్ రాజు కోరారు. శుక్రవారం బెల్లంపల్లిలో ఏర్పాటు చేసిన బీజేపీ శక్తి కేంద్రాల ఇన్‌చార్జిల సమావేశంలో కేంద్ర ఫిషరీస్, పశు సంవర్థక, పాడి పరిశ్రమ శాఖ మంత్రి పురుషోత్తం రూపాలను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆదర్శ్‌వర్ధన్ రాజు మాట్లాడుతూ... బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో దళితులు, గిరిజనులు అత్యధిక మంది ఉన్నారని అన్నారు. వీరి పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడానికి ఏకలవ్య మోడల్ స్కూల్‌ను మంజూరు చేసి ప్రారంభించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్‌యూఐ శ్రేణులు కొయ్యడ రవికుమార్, చిలుముల సాయి కుమార్, ఉమేష్ పాల్గొన్నారు.

కారుణ్య నియామకపత్రాలు అందజేత

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని జీఎం కార్యాలయంలో శుక్రవారం ఏరియా జీఎం మోహన్ రెడ్డి 12 మందికి కారుణ్య ఉద్యోగ నియామక పత్రాలను అందించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ నూతనంగా ఉద్యోగంలో చేరిన వారు సంస్థ నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు సహకరించాలని అన్నారు. పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, సీనియర్ పీవో సత్యబోస్ యూనియన్ల ప్రతినిధులు ఉన్నారు.

శ్రీరాంపూర్‌లో..

శ్రీరాంపూర్: గత వర్షాకాలంలో దొహిగం వరదల్లో చిక్కుకున్న గర్భిణిని రక్షించబోయి మృతి చెందిన అంబాల రాము(ఆర్కే 5) అనే రెస్క్యూ సభ్యుడి కుటుంబానికి కంపెనీ కారుణ్య నియామకం అందించింది. శుక్రవారం జీఎం కార్యాలయంలో ఇన్‌చార్జి జీఎం త్యాగరాజు చేతుల మీదుగా రాము భార్య స్పందనకు కారుణ్య ఉద్యోగ నియామక పత్రం అందించారు. కంపెనీ వారికి ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డీజీఎం(పర్సనల్) అరవిందరావు, ఏరియా రక్షణాధికారి కే వెంకటేశ్వర్‌రెడ్డి, టీబీజీకేఎస్ జీఎం కమిటీ చర్చల ప్రతినిధి వెంగళ కుమారస్వామి, ఎస్ఈ చంద్రశేఖర్; సీనియర్ పీఓ కాంతారావు, ప్రకాశ్‌రావు, రణదీప్‌గౌడ్, జీఎం కార్యాలయం ఫిట్ సెక్రెటరీ పీవీ రావు పాల్గొన్నారు.


కారుణ్య నియామక పత్రాలు అందజేసిన జీఎం

ఉత్పత్తి సాధనలో భాగస్వామ్యం కావాలి

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి ఉత్పత్తి, ఉత్పాదకత లక్ష్య సాధనలో ఉద్యోగులంతా అంకితభావంతో పని చేసి భాగస్వామ్యం కావాలని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ దేవేందర్ అన్నారు. శుక్రవారం గోలేటి టౌన్‌షిప్ లోని జీఎం కార్యాలయ ఆవరణలో ఆరుగురికి కారుణ్య ఉద్యోగ నియామక పత్రాలను అందచేశారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాసరావు, పర్సనల్‌మేనేజర్ లక్ష్మణరావు, డీవైపీఎం తిరుపతి పాల్గొన్నారు.

రేపు 'చలో హైదరాబాద్'

మంచిర్యాలఅగ్రికల్చర్: హైదరాబాద్‌లో ఈ నెల 22న నిర్వహించే బహుజన ఉద్యోగ ఉద్యమ శంఖారావంను విజయవంతం చేయాలని తెలంగాణ బహుజన విద్యుత్ ఉద్యోగ ఆర్టిజన్ సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తెన శివ శేఖర్ అన్నారు. శుక్రవారం పాత మంచిర్యాలలోని ట్రాన్స్‌కో కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బహుజన ఉద్యోగ ఉద్యమ శంఖరావం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ ఆర్ ఎస్ ప్రవీణ్‌కుమార్ హాజరై మాట్లాడుతారని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు భూక్యా రాజు, ప్రచార కార్యదర్శి నాగుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

వరకట్న వేధింపుల కేసులో ముగ్గురి అరెస్ట్

బెల్లంపల్లి: బెల్లంపల్లి కన్నాలబస్తీలో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న కేసులో పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. ఈనెల 17న నవవధువు అపరాధ ప్రవళిక ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకోగా మృతురాలి తల్లిదండ్రులు తోట లలిత, మల్లయ్య అదనపు వరకట్నం తీసుకు రావాలని అత్తారింటివారు వేధించడంతో తమ కూతురు ఆత్మహత్య చేసుకున్నట్లు ఫిర్యాదు చేశారు. దీంతో ప్రవళిక ఆత్మహత్యకు కారకులైన భర్త అపరాధ సతీష్, అత్తమామ లక్ష్మీ అలియాస్ మణిమ్మ, సారయ్యలతో పాటు ఆడబిడ్డలు సుమలత, కావ్యలపై కేసు నమోదైంది. శుక్రవారం మృతురాలి భర్త, అత్త మామలను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఏసీపీ పంతాటి సదయ్య తెలిపారు.

మద్యం మైకంలో యువకుడి ఆత్మహత్య


శేఖర్ (ఫైల్)

కోటపల్లి: పురుగుల మందుతాగి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని కొల్లూర్ గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. పార్‌పల్లి శేఖర్ (35), లక్ష్మి ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు. ఇటీవల శేఖర్ మద్యానికి బానిస కావడంతో కుటుంబ పోషణ భారంగా మారింది. గురువారం మద్యం మత్తులో ఇంటికి వచ్చిన శేఖర్‌ను భార్య మందలించింది. దీంతో ఇంటి నుంచి వెళ్లిన శేఖర్ పురుగుల మందుతాగి ఇంటికి వచ్చి పడిపోయాడు. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకువెళ్తుండగా మార్గంమధ్యలో మృతిచెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకట్ తెలిపారు.

మద్యం మత్తులో మరో యువకుడు..


కిరణ్‌గౌడ్(ఫైల్)

చెన్నూర్‌రూరల్: మండలంలోని లంబడిపల్లి గ్రామానికి చెందిన గట్టు కిరణ్‌గౌడ్(22) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం... కిరణ్‌గౌడ్ చెన్నూర్‌లో బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా కిరణ్‌గౌడ్ మద్యానికి బానిసయ్యాడు. రోజులాగే గురువారం అర్ధరాత్రి మద్యం తాగి ఇంటికి రాగా తాగద్దని కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో తన గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శుక్రవారం ఉదయం తలుపులు తీయకపోవడంతో అనుమానం వచ్చి కిటికిలోంచి చూడగా ఉరేసుకుని కనిపించాడు. పోలీసులు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. తండ్రి బాపాగౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సౌజన్య తెలిపారు.

బైక్ ఢీకొని వృద్ధుడి మృతి

దండేపల్లి: బైక్ ఢీకొని మండలంలోని మాదాపూర్‌కు చెందిన మేక రామయ్య (60) గురువారం రాత్రి మృతి చెందాడు. ఎస్సై ప్రసాద్ వివరాల ప్రకారం.. రామయ్య మేదరిపేట పెట్రోల్ బంక్‌లో నైట్ వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. రాత్రి ఇంటి నుంచి సైకిల్‌పై పెట్రోల్ బంక్‌కు వెళ్తుండగా మాదాపూర్ వాటర్ ట్యాంక్ సమీపంలో కొత్తమామిడిపల్లికి చెందిన రాజు బైక్‌తో వేగంగా ఢీకొట్టాడు. రామయ్య తలకు బలమైన గాయమై సంఘటన స్థలంలోనే మృతిచెందాడు.. మృతుడి కుమారుడు శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.